# స్వయంకృతం




ఉన్నట్టుండి పెద్దగా ఉరిమినట్టు అయింది.

మరుక్షణం పెద్ద పెద్ద అరుపులు, కేకలు వినపడినాయి, ఆఫీసరు గది లోంచి. చైతన్యం ఘనీభవించి ఆఫీసు మొత్తం గజగజ లాడింది. కొన్ని క్షణాలు నిశ్శబ్దం నిలదొక్కుకుంది.

పాత గుమాస్తాలు కొన్ని క్షణాల తరవాత నిలదొక్కుకుని ఊపిరి పీల్చుకున్నారు. కొత్త పక్షులు గజగజ వణుకుతూ గబగబ పని చేసుకు పోతున్నట్టు నటిస్తున్నారు ఇంకా.

హెడ్ గుమాస్తా చిదానంద స్వరూపుల్లా మొహం పెట్టి ఒకసారి ఆఫీసంతా కలయచూశాడు, తన రాజ్యాన్ని పర్యటిస్తున్న సామంతరాజులాగా.

టై 5

మెషీన్లు మరలా టక్‌టక్ మంటు న్నాయి. మరుక్షణం ఆఫీసరుగారి గది తలుపులు భళ్ళున తెరుచుకున్నాయి. క్షతగాత్రుడయిన సైనికుడు యుద్ధ రంగంనుంచి బయట పడినట్లు చెంపలు తడుముకుంటూ సూరిబాబు బయటి కొచ్చాడు. సూరిబాబు ఆ ఆఫీసులో పనిచేస్తున్న చిన్న గుమాస్తా.

"ఏమిటి?"

"ఏమయింది?"

"ఏమిటి గొడవ?"

అన్నట్టు అనేక జతల కళ్ళు సూరి బాబు వైపు ప్రశ్నల వర్షం కురిపిం చాయి. అదేవీ గమనించనట్లు సూరి బాబు తన సీటువైపు నిదానంగా నడి చాడు.

"మిస్టర్ సూరిబాబూ!" హెడ్ గుమాస్తా పిలిచాడు. "ఇట్లా వచ్చి కూర్చోండి. ఈ మంచినీళ్లేమయినా తాగుతారా?"

"వద్దు, సార్!"

"అదేమిటోయ్? మన దూర్వాసుల వారు అగ్నిపర్వతంలా పేలారు? ఏమిటి సంగతి? అసలు విషయం ఏమిటట?"

"ఏం లేదు, సార్."

"అరె! పిచ్చాడిలాగ ఉన్నావే! ఇంత గొడవ జరిగి ఆఫీసు దడదడ లాడిపోయింది గదా— ఏం లేదంటావు?!" ఆశ్చర్య పడిపోయాడు హెడ్ గుమాస్తా నర పీడనం.

మరి కాస్సేపటికి ఆశ్చర్యంనుంచి తేరుకుని, "ఏదో ఉంది. నువ్వు దాస్తు న్నావు" అని దబాయించాడు సూరి బాబుని.

"మంచయినా, చెడయినా నాతో చెప్పుకోవాలి. పెద్దవాడిని, నీ కష్టసుఖాలు నావి గాదా? నాతో చెపితే చేతనయిన సాయం చేస్తానుగా" అన్నాడు.

సూరిబాబు నవ్వాడు.

"అదేమిటి అట్లా నవ్వుతావు! ఆ చెంప ఏమిటి, అట్లా ఎర్రబడింది? అసలేం జరిగిందీ చెప్పవయ్యా, బాబూ!"

"ఏముంది, సార్, చెప్పటానికి?"

"అరె! నువ్వు భలే వాడివిలా ఉన్నావే? నువ్వు ఆఫీసరుగారి గదిలోకి పోవటం ఇక్కడున్న జనం యావన్మందీ చూశారు. తరవాత వెంటనే పెద్ద గొడవ అయింది. నిన్ను చూస్తే ఆయన చేతివాటం రుచి చూసినట్టు కనపడుతూ ఉంది. ఎందుకు దాస్తావు? అసలేం జరిగిందయ్యా అంటే?"

"ఏం లేదు, సార్! ఇంకు బాటిల్ ఒలికింది."

"ఒలికిందా? ఎట్లా? ఆ సిరా ఆయనమీద పడలేదు గదా!"

"పడింది."

---

**హక్కుల పేరుతో కార్యాలయాలలో విచిత్రమైన సంఘటనలు జరుగుతూంటాయి. ఇటువంటి సంఘర్షణలకోసం కొంతమంది నాయకులు కాచుకొని ఉంటుంటారు. రెండు చేతులు కలిస్తే కాని చప్పుడు కాదు.**

---

"నట్టమే! నువ్వు పడగొట్టావా? ఎన్ని గుండెలు!"

"ఏదో పొరపాటయింది, సార్!"

"ఆఁ ఇంకు ఒలికింది. అది ఆఫీసరు గారిమీద పడింది. ఇక నువ్వు చెప్పక్కర్లేదు లేవోయ్! దానితో ఆయన పులిలా మీద పడ్డాడు. గాండ్రించి గొడవ పెట్టి నీ చెంప పగల గొట్టాడు. అయినా, అంత అజాగ్రత్త అయితే ఎల్లాగోయ్! పెద్ద వాళ్ల దగ్గిర కెళ్లినప్పుడు కాస్త ఒళ్ళు దగ్గర పెట్టుకోవద్దూ?"

"జాగ్రత్తగానే ఉన్నా, సార్! కంగారు పడ్డాను. అంతే!"

"పడ్డావయ్యా. సరే! నువ్వు కుర్రాడివి. ఆయన్ని చూసి భయపడి ఉంటావు. సిరా ఒలికింది. అయితే! కొట్టాడా? కొడితే నువ్వు ఊరుకున్నావా? పైగా, ఏం జరగలేదంటున్నావా? ఆ మనిషికి ఎంత కోపమయితే మాత్రం, నువ్వు పొరపాటు చేస్తే మాత్రం అలా నీచంగా కొడతాడా?!"

"ఎందుకులెండి, సార్, గొడవ?"

"గొడవేమిటయ్యా! ఇది మెదల కుండా ఊరుకునే విషయమేనా అని!"

"మరేం చెయ్యమంటారు?"

"మిస్టర్! నువ్వు ఊరుకుంటానన్నా మే మెట్లా ఊరుకుంటామయ్యా? ఇది మనందరికీ సంబంధించిన విషయం. 'ప్రెస్టీజ్ క్వశ్చన్'. ఏదో ఒకటి చెయ్యాల్సిందే" అంటూ గంట కొట్టాడు నరపీడనం.

గంట కొట్టి చీమ్రలావు కోసం ప్యూన్‌ని పంపాడు.

చీమ్రలావు గబగబా నరుగెత్తుకు వచ్చాడు— "ఏమిటి, సార్?" అంటూ.

"ఏమిటని అడుగుతావేమిటోయ్! కొంప మునిగింది. ఈ గొడవ నీ 'రికార్డు రూమ్'దాకా రాలేదు కామోసు. లేకపోతే అలవాటు ప్రకారం నిద్రతో పడ్డావా?"

"అవును, సార్, రాత్రి సెకండ్ షోకి. . ."

"సరి సరి. ఇప్పుడు పెద్ద గొడవ జరిగింది. మన సూరిబాబుని ఆఫీసరు గారు కొట్టారు. పొరపాటు ఉంటే ఉండవచ్చు. అయితే ప్రొసీజర్ ప్రకారం ఏక్షన్ తీసుకోవచ్చుగా? కొట్టటానికి ఆయనకి గల హక్కు ఏమిటీ అని?"

"కొట్టాడా?" చీమ్రలావు మీసాలు అదిరాయి. అరడు గెత్తు జుత్తూ తలమీద గజగజ లాడింది. కళ్ళు ఎర్రగా అయ్యాయి. ఆవేశంలో శరీరం వణికి పోయింది. చిటచిట్లాడాడు చీమ్రలావు.

"అవున్నాయనా! అందుకే నిన్ను పిలిపిస్తి. ఇది మనందరి ప్రెస్టేజ్ క్వశ్చన్. పోన్లెమ్మనటానికి ఆషామాషీ వ్యవహారం గాదు. మన అసోసియేషన్ బ్రాంచి ప్రెసిడెంటువి గదా నువ్వు? ఒక మనిషిని ఉన్నపాటున 'మాన్‌హాండిలు' చెయ్యడమంటే వదిలేయవలసిన వ్యవహారం గాదు. ఏదో తేల్చాల్సిందే." నరపీడనంగారు ఉద్రేకం తెచ్చుకుని అదంతా చీమ్రలావుకి ఇంజక్టు చేశారు.

"అవును, సార్! మనమూ మనుషులమే. చీమూ నెత్తురూ ఉన్న వాళ్లమే. ఇదేదో ఈ వేళ తేల్చాల్సిందే." చీమ్రలావు బల్లగుద్ది అన్నాడు.

ఆ సరికి చద్రలావు, జలగా, నల్లీ అక్కడికి చేరిపోయారు.

చద్రలావు ఎస్టాబ్లిష్‌మెంట్ క్లార్కు. జలగది బిల్సు సీటు. నల్లిది నరపీడనం స్వంత వ్యవహారాలు చూసే పని. వాళ్ళు ముగ్గురూ ఆఫీసుకి స్తంభాల్లాంటి వాళ్ళు. నరపీడనంగారి నమ్మిన బంటుల్లు.

ఒకానొక కాలంలో ఆఫీసు మొత్తాన్ని, ఆఫీసరుగార్ని పక్కన కూర్చోపెట్టి ఎదురు లేకుండా పాలించిన వాళ్ళు వీళ్ళు.

చీమ్రలావు ఉద్రేకి. ప్రతి చిన్న విషయానికీ ఎగిరెగిరి పడే తత్త్వం అతనిది. 'తిరుగుబాటు నా జీవితం' అంటాడు. అనామకుల దగ్గర, బక్క గుమాస్తాల వద్ద పలుకుబడి ఉంది.

---

## పాలడుగు వెంకటేశ్వరరావు

---

ఆఫీసులో అతని వర్గం అతని కుంది. అందుకే క్రితంసారి అసోసియేషన్ ఎన్నికలు వచ్చినప్పుడు నరపీడనం వర్గంతో పోటీకి నిలబడ్డాడు చీమ్రలావు. కొంతకాలం తీవ్ర ప్రచారం జరిగిన మీదట సంధి జరిగింది. ఆ ప్రకారం చీమ్రలావు అధ్యక్షుడుగా, చద్రలావు ఉపాధ్యక్షుడుగా, నల్లి కార్యదర్శిగా, జలగ కోశాధికారిగా, రత్తయ్య సహాయ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నిక జరిగేలా చేశారు నరపీడనంగారు. రత్తయ్యా, చీమ్రలావూ తప్ప మిగిలిన అందరూ నరపీడనంగారి వర్గం వాళ్లే.

ఈమధ్య నరపీడనంగారు చిరాగ్గా ఉంటున్నారు.

పాత ఆఫీసరు పోయి, కొత్త ఆఫీసరు రావటం అసలు ఆ ఆఫీసుకి శని పట్టుకున్నట్టు అయిందని నరపీడనం ఉద్దేశ్యం. అక్కడికీ సామ, దాన, భేదోపాయాలు ప్రయోగించి చూశారు. ఫలితం లేకుండా పోయింది.

కొత్త ఆఫీసరు వచ్చి ఆరు నెలలు కాలేదు.

ఆఫీసు ప్రొసీజరే మారిపోయింది.

ఠంచనుగా తొమ్మిది కల్లా వచ్చి సాయంత్రం ఏడున్నర దాకా చాకిరీ చెయ్యటం, ప్రతి విషయానికీ ముక్కుకు సూటిగా పోవటం, తను గొడ్డులాగా పనిచేసి, క్రిందివాళ్లనికూడా అలాగే చెయ్యమనటం, ప్రతిదీ కాగితంమీద పెట్టటం, ఏ విషయంలోనూ పట్టు విడుపులు లేకుండా ఉండటం— ఆఫీసరు గారి ఈ లక్షణాలన్నీ నరపీడనానికి ప్రాణాంతకంగా తయారయాయి.

అయితే, ఒక సంగతి.

ఏ విషయానికయినా ఆఫీసరుతో మాట్లాడటానికి ఒక్క నరపీడనంగారు తప్ప మరో ప్రాణికి ఏమాత్రం అర్హత లేదు.

ఆన్సర్ టు ది పాయింట్. సబ్జక్టు అంటే సబ్జక్టే. కుంటివేషాలు, నక్క వినయాలు ఈ ఆఫీసరుకి సుతరామూ కిట్టవు.

పోనీ, ఈ మనిషి తత్త్వం ఇంతే. అమ్మగారిని పట్టి అయినా ఈ మనిషిని కొంత మెత్తపడేట్టు చేద్దామనుకున్నాడు నరపీడనం. ఆ విషయం గురించే నల్లీ, జలగా కలిసి ఎవరికీ తెలియకుండా ఆఫీసరు గారి కొంప చుట్టూ పదిహేను రోజులు తిరిగారు. దానా దీనా తేలిందేమంటే, ఆయనగారి ఫామిలీ ఎక్కడో మద్రాసులో ఉంటున్నారనీ, ఇక్కడ కాపరం పెట్టే ఉద్దేశ్యం లేదనీ.

కనక ఆ దారీ మూసుకుపోయింది.

ఆయన మాట్లాడితే కారం చల్లినట్లుంటుంది. చూపు చూస్తే మంటలు మండినట్లు అనిపిస్తుంది. మనిషి అంటే ఉక్కుముక్కలా ఉంటాడు.

ఇరవై సంవత్సరాల సర్వీసు ఉండి, పాలనాదక్షత ఉండి అంతవరకూ తిరుగులేదనిపించుకున్న నరపీడనంగారే ఆఫీసరు రమ్మన్నాడంటే గజగజ వణుకుతాడంటే,

ఇక మామూలు గుమాస్తాల సంగతి చెప్పాలా?

అందుకే చిమ్రలావు ఎంతసేపూ 'రికార్డు రూమ్'లోనే మనుషుల్ని పోగు చేసి 'సోషలిజమ్' మీద లెక్చర్లు దంచుతాడు. జలగా, నల్లీకూడా ఇదివరకటి వలె పార్టీల్ని దబాయించటానికి వెనకాడుతున్నారు. ఈమధ్య వాళ్లకి చేతుల్లో పైసా ఆడక పిటపిట అయిపోయింది.

ఇంతమంది జనాల్ని ఇట్లా క్షోభ పెడుతూన్న ఆ ఆఫీసరు అసలు ఏం మనిషని నరపీడనంగారి అనుమానం. గట్టిగా నోరు తెరిచి మాట్లాడాలంటే ప్రతి వాడికీ భయం. ఇదివరకటిలాగా మామూళ్లు అందటం లేదు. కాగితాల్ని గట్టిగా తొక్కి పట్టి, ఒక చూపు చూద్దామంటే పైన ఆ అగ్నిహోత్రుడు! పిచ్చివాడి చేతి రాయిలాగా ఏ క్షణాన ఏం చేస్తాడో! ఆ భయంతో అందరి గుండెలు గుబగుబ మంటాయి. అందుకే ఆఫీసు నరకంలా తయారయింది.

ఒక ప్రెస్టేజ్ లేదు.
ఒక పద్దతి లేదు.
ఒక మంచి లేదు.
ఒక మర్యాద లేదు.

పైగా, ఆ మనిషికి చెట్టంత కోపం. కోపం వస్తే అసలు మనిషి కాడు. ఒకళ్లిద్దర్ని కొట్టినంత పని చేశాడు. ఇప్పుడు సూరిబాబుని కొట్టనే కొట్టాడు.

గుమాస్తా మనిషి కాడా?

ఆయన ఆఫీసరయితే ఆయనకి గొప్ప.

దేశంలో 'మాన్ హేండ్లింగ్' చెయ్యటానికి చట్టం ప్రకారం ఎవరికీ హక్కు లేదు.

ఇది ప్రజాస్వామ్యం గాని 'డిక్టేటర్ షిప్పు' కాదు గదా!

నరపీడనం, నల్లీ, జలగా—ముగ్గురూ కలిసి పెట్టిన ఈ ఘోష చిమ్రలావు తలకి ఎక్కింది. ఎక్కిన తరవాత చిందులు తొక్కాడు. ఎగిరి పడ్డాడు. ఇక లాభం లేదన్నాడు. ఊరుకోవటానికి వీల్లే దన్నాడు చిమ్రలావు.

"సూరిబాబూ! నీ కెందుకు? మే మున్నాము. బాధపడమాకు" అని బుజ్జగించాడు.

తీవ్రంగా తర్జన భర్జనలు అయాక సాయంత్రం అయిదు తరవాత మీటింగు పెట్టి 'ఏక్షన్' గురించి నిర్ణయించాలని అనుకుని ఎవరి సీట్లోకి వాళ్లు వెళ్లిపోయారు—చిమ్రలావూ, జలగా, నల్లీ, చద్రలావూ.

"మరేం ఫర్వాలేదోయ్. ధైర్యంగా ఉండాలి, సూరిబాబూ! మేమంతా లేమూ?" అన్నాడు నరపీడనం.

సూరిబాబు తన సీట్లోకి వెళ్లి కూర్చోకముందే కాఫీ అందించాడు రత్తయ్య.

"మన వాళ్లందరినీ ధైర్యంగా ఉండమని కాఫీలు తెప్పించారండీ జలగ గారు. సాయంత్రం మీటింగట" అంటూ కాగితంమీద సంతకం పెట్టించుకుని వెళ్లాడు సూరిబాబు చేతకూడా.

రోజంతా అదే తర్జన భర్జన. ఆఫీసంతా ఉడికిపోయింది.

గుసగుసలు.

"ఇంతకీ ఏమవుతుందంటావు?"

"నా మొహమవుతుంది! అంతా ఆరంభశూరత్వం!"

"ఆఫీసర్ని గట్టిగా అడుగుతారట!"

"ఎవరు?"

"ఎవరేమిటి? అంతా కలిసి."

"సూరిబాబుని ముందు నిలబెట్టా?"

"అట."

"ఏమయినా నరపీడనం పెద్ద ప్లాను మీదే ఉన్నాడు. ఎట్లా అయినా అలవాటు పడిన ప్రాణులు గదా! జనాల్ని పీడించుకు తింటూ వీళ్ళు చేసే ఘోరాల కంటేనా? ఆ జలగ్గాడు, నల్లిగాడు, నరపీడనంగాడు తమ ఆటలు సాగటం లేదనేగా ఈ గొడవ చేస్త? ఇదంతా పొలిటిక్స్."

"జాగ్రత్త. వాళ్లు వినగలరు—సి. ఐ. డి. లు. అయినా, మన కెందుకు?"

"అదే మరి! ప్రతి వాడూ మన కెందుకు అనుకోబట్టే. . ."

"పోన్లెద్దూ, మన కెందుకు?"

లంచవ రయాక మధ్యాహ్నం మూడు గంటలకి సూరిబాబుకి ఆఫీసరు నుంచి పిలుపు అందింది, ప్యూన్ ద్వారా.

'మళ్లీ ఏం కొంప మునిగిందిరా, భగవంతుడా' అనుకుంటూ సూరిబాబు భయపడుతూ, భయపడుతూ ఆయన గదిలోకి వెళ్లాడు.

పది నిమిషాల తరవాత బయటికి వచ్చాడు సూరిబాబు.

నలుగురూ చుట్టేశారు.

"ఏమిటి?"

"ఏమంటాడు?"

"క్షమాపణ చెప్పాడా?"

"అయినా, అంత తొందరపాటు పనికి రాదు మనిషికి."

సూరిబాబు గాలి పీల్చుకోవటానికి అయిదు నిమిషాలు పట్టింది.

"ఏంలేదు, స్వాములూ! ఏదో 'రిఫరెన్సు' కోసం పిలిచారు" అన్నాడు.

"నీ మొహం. నీ లాంటి వాళ్లని చూసుకునే ఆయన అట్లా ఎగిరి పడుతున్నాడు."

"ఇందులో నీ ఒక్కడి విషయం కాదు. మనందరి ప్రెస్టేజ్ ఉంది."

"కనక ఆయనతో 'కాంప్రమైజ్' అవమాక, ఏమయినా సరే."

"ఈ దెబ్బతో ఆయన పని అవాల్సిందే."

"కాకపోతే. . ."

ఆ తరవాత గంటకి నరపీడనానికి పిలుపు వచ్చింది.

లోపల ఏం జరిగిందో గాని, అర గంట లోగా ఏదో సబ్జక్టు గురించి ఆర్డర్సు జలగ చేత రాయించి పట్టుకెళ్లి స్వయంగా సంతకం పెట్టించుకొచ్చాడు నరపీడనం.

ఆ వెంటనే ఆర్డర్సు టైప్ చేయించి వెనువెంటనే సూరిబాబుకి 'సర్వ్' చేయించాడు కూడా. అప్పటినుంచీ సూరి బాబు వైపు కొరకొరా చూశాడు నరపీడనం. అయిదయింది.

ఎన్నడూ లేనిది ఆ రోజు అయిదింటికే ఆఫీసరు వెళ్లిపోయాడు.

సూరిబాబు ఇంటి కెళుతూంటే అతన్ని పట్టుకుని మీటింగుకి లాక్కుని వెళ్లారు జలగా, నల్లీ.

ఆఫీసు పక్షులన్నీ చేరినాయి.

మీటింగ్ మొదలయింది.

నరపీడనంగారు అధ్యక్షత వహించారు.

చిమ్రలావు ఉద్రేకంగా ఉపన్యసించాడు.

తరవాత నల్లీ. జలగా మాట్లాడారు.

సారాంశం ఒక్కటే.

ఆఫీసరుగారు చేసింది తప్పు.

ఎంత చిన్నవాడయినా ఒక గుమాస్తాని ఆఫీసరు కొట్టటం సహించరానిది. ఇది గుమాస్తా లోకానికే అవమానం. ఆఫీసుకే కళంకం. అందరూ కలిసి ఆఫీసరుచేత సూరిబాబుకి క్షమాపణ చెప్పించాలి. లేకపోయినట్లయితే పై ఆఫీసుకి రాయాలి. అక్కడికీ జరగకపోతే కోర్టులో పరువు నష్టం కేసు పెట్టాలి.

వక్తల ఉపన్యాసాలు అయాక బాధితుడయిన సూరిబాబుని మాట్లాడమన్నారు. అసలు విషయమంతా వివరంగా చెప్పమన్నారు. సూరిబాబు లేచేసరికి జలగ



నలుపు - తెలుపు

చిత్రం—వై. బాలయ్య ( సిద్దిపేట )

ఎక్కడినుంచో ఓ పూలదండ తీసుకు వచ్చి మెడలో వేశాడు. సభికులు కరతాళ ధ్వనులు చేశారు. సూరిబాబు గొంతు సవరించుకుని చెప్పాడు.

"పెద్దలారా!

నేనో సామాన్య సంసారిని. మామూలు గుమాస్తాని. నా జీతం నూటఏభై. ఇంక్రిమెంటు రేటు నాలుగు రూపాయలు. నేను ఇంటికి పెద్ద కొడుకుని. మా నాన్నో గుమాస్తా ఉద్యోగం చేసి ఈమధ్యే రిటైరయినారు. మా కుటుంబానికి నేనే ఆధారం. నాకు ఇద్దరు తమ్ముళ్లూ, ఇద్దరు చెల్లెళ్లూ ఉన్నారు. తమ్ముళ్లు, చెల్లెళ్లు ఇంకా చిన్నవాళ్లు. నాకు పెళ్లయింది. నాకు ఇద్దరు పిల్లలు. ఇదీ నా సంసారం. మా నాన్నకి పింఛను రాళ్లు ఓ ఏభై వస్తాయి. నాకు రెండు వందలు వస్తాయి. వాటితో మా కుటుంబం గడవాలి. అయినా, నేనూ మనిషినే. చీమూ, నెత్తురూ ఉంది. అభిమానం, ఆత్మగౌరవం ఉన్నాయి. డబ్బుకి పేదనయినా, గుణం ఉంది. . ."

"హియర్! హియర్!" చప్పట్లు.

సూరిబాబు సాగించాడు:

"బ్రతుకు కోసం ఎలాంటిదయినా నేను గుమాస్తా ఉద్యోగం చెయ్యవలిసి వచ్చింది. దాని కోసమే తిట్లూ, చీవాట్లూ తినటానికి సిద్ధపడ్డాను. ఇప్పుడు మనకి ప్రజాస్వామ్యం ఉంది. అందరికీ సమాన హక్కు లున్నాయి. బాధ్యతలు ఉన్నాయి. మన గుమాస్తాలది ఒక జాతి. మన హక్కులని రక్షించుకోవటానికి మన కో సంఘం ఉంది. ఉండాలి. లేకపోతే మనం లెక్కలో లేకుండా పోతాము. చీమల్లా దిక్కులేని వాళ్ల మవుతాము."

చప్పట్లు.

"మన హక్కులు మనం రక్షించుకోవాలి. మనందరం కలిసి మెలిసి ఉండాలి. ఒకరి కొకరం చేదోడు వాదోడుగా ఉండాలి. ఆదే మన బలం."

"హియర్, హియర్!"

"అయితే, ఆ సామరస్యమే మనలో లోపించిందని చెప్పటానికివిచారిస్తున్నాను. నేను సర్వీసులో చేరి అయిదేళ్లయింది. లెక్క ప్రకారం నాకు అయిదు ఇంక్రిమెంట్లు వచ్చి ఇంకో ఇరవై రూపాయలు నెల నెలా నేను అదనంగా అందుకోవాలి. ఈ కరువు రోజుల్లో ఈ ఇరవై రూపాయలే నాకు వరప్రసాదం. అదే గగనకుసుమ మయింది. నా ఇంక్రిమెంటు ఇన్నాళ్లూ ఇనపచక్రంలో పడి నలిగి పోయింది. నేను ఎంతో బాధ పడ్డాను. ఎన్నో ప్రయత్నాలు చేశాను. ఫలితం శూన్యం. బరువు పడందే కదల వన్నాయి కాగితాలు. బ్రతుకే బరువయి కుంగి పోతున్న నేను, నా ఇంక్రిమెంటు కాగితాల మీద బరువు ఎక్కణ్ణించి పెట్టను? ఇక ఈ ఇనప చక్రాల క్రింద నలగటం తప్ప నాకు మోక్షం లేదా? రోజుల తరబడి గుండెబాధతో కుమిలి పోయాను.



నా గోడు వినేవారెవరు?

ఎవరితో చెప్పుకోను?

ఆఫీసర్లకి 'అప్రోచ్' లేదు. వాళ్ళు ఇనప పంజరాల్లో కూర్చుని ఉంటారు. కబంధ హస్తాలు— మన గుమాస్తాలవే— నా కాగితాల్ని తొక్కిపట్టి ఉంచాయి.

ఆ పరిస్థితిలో మొండిధైర్యం చేశాను.

ఈ ఆఫీసరు అగ్ని పర్వతం. మొండి వాడు. ముక్కోపి. చండశాసనుడు. అయినా చిన్నప్పుడు మా నాన్న చెప్పాడు— 'ఉరిమే మేఘమే వర్షం కురుస్తుందిరా' అని. ఇన్నాళ్లూ ఆలోచించి ఈ ఉదయం ధైర్యం చేశాను. కావాలనే ఆఫీసరుగారి సిరాబుడ్డిని ఒలక పోశాను. ఆయన ఆగ్రహానికిగురయి నేరానికి శిక్ష అనుభవించాను. అదంతా నా మంచికే అని విశ్వసించాను. మధ్యాహ్నానికల్లా చల్లబడి, ఆయనే నాకు కబురంపాడు. తను తొందర పడ్డాననీ, ఏం అనుకోవద్దనీ అన్నాడు. నా గురించి, నా కుటుంబం గురించి అడిగి తెలుసుకున్నాడు. నా సర్వీసు సంగతి వాకబు చేశాడు. నా కష్టం గుర్తించి సాయంత్రానికల్లా ఇంక్రిమెంటు ఆర్డర్సు చేతి కిప్పించాడు. రెండు రోజుల్లో 'ఇంక్రిమెంటల్ అరియర్స్' వచ్చే ఏర్పాటూ చేశాడు. ముక్కోపి అయినా ఆయనది గొప్ప మనసు.

వడ్డనా డెప్పుడూ చెడ్డవాడు కాదు.

అన్నీ తెలిసే కావాలని ఆయన చేతి దెబ్బ తిన్నాను.

ఆ తరవాత నాకు 'మేలు జరుగుతుం' దన్న నా విశ్వాసం నిజమయింది.

ఇందుకు ఎవర్నీ నిందించి లాభం లేదు. మన గుమాస్తా బ్రతుకులు అల్లాంటివి. ఒక గుమాస్తాయే రెండో వాడి రక్తం పీల్చటానికి వెరవని పరిస్థితి మనది. మనకి మనం సహకరించుకో లేని వాళ్లము, మన బాధ్యత మనమే గుర్తించనివాళ్లము అయిన మనం హక్కుల కోసం ముందుకు దూకుతున్నాము. శుభం. సోదరులారా! ఇందులో ఆఫీసరు తప్పు లేదు. అంత నా స్వయంకృతాపరాధం. కావాలని నేనే ఆయన్ని రెచ్చగొట్టి, నా పని సాధించుకున్నాను. నా మీద సానుభూతితో మన నరపీడనంగారు, జలగగారు, నల్లిగారు, చదర్లావుగారు, చీమర్లావు గారు శ్రమతో ఈ సభ ఏర్పాటు చేశారు. కృతజ్ఞుణ్ణి. భగవంతుడు మనకి మేలు చేయుగాక. సెలవు" అని సూరిబాబు కూర్చున్నాడు.

అప్పుడు ఆ పరిసరాల్లో సూది వేస్తే చిటుక్కుమని వినిపించేటంత నిశ్శబ్దం కొన్ని క్షణాలు రాజ్యం చేసింది. ★

# కాలచక్రం

కాలచక్రం మీద నిలబడి
కాలు జారిపోతున్న దేమని
నాలుక కరచుకొని
గిరగిర తిరిగే
చక్ర వేగానికి
తట్టుకోలేక భయపడి
గతాన్ని తిట్టకు,
వర్తమానాన్ని కసరకు
భవిష్యత్తుని చూసి
గాభరా పడకు!
కాలచక్ర గమనానికి
ఒక నిర్దిష్ట గమనం ఉంది!
ఒక గమ్యమూ ఉంది!
ధర్మాన్ని కాదని
అధర్మంగా అందలం
అందుకోవాలని
ఎదురీదకు కాలానికి
వేయలేవు కళ్లెం
నడిచే కాలానికి!
దరిచేరే గమ్యానికి
తగిలించకు గొళ్లెం ! !
కాలంతో జట్టుకట్టి
కాలంతో అడుగు వేసి
కాలానికి అనుగుణమైన
కథనంతో కథలు అల్లు!
కమ్మనైన కవిత పాడు ! !
కదలించే కాలచక్ర
గమనానికి లయను కలిపి
కవిత రాసి పలికించుము
కాలంతోపాటు రథం
కదిలి చేరు నవ్యపథం! !

—ఎల్లోరా

ఋతుక్రమం ఆలస్యమైతే ?
విచారపడవద్దు ప్రఖ్యాతిగాంచిన "దేవిపిల్సు" వాడండి
దేవి పిల్సు ముఖ్యంగా అలస్యమైన, క్రమముగాకాక పోయిన, బాధతోకూడిన, లేక ఆగిపోయినబహిష్టుకు దేవిపిల్సు బాగుగ గుణమిచ్చును


1 అన్ని సందర్భములలోను శీఘ్రముగాను, అమోఘముగాను పనిచేయును
2 ఏస్థితిలోను ఆరోగ్యమునకు ఎట్టిహాని కలిగింపదు
FULL COURSE 28 TABLETS Rs.11/-
HALF COURSE 14 TABLETS Rs.6.50
ప్రతిచోట దొరకును
Mfrs:- SEENU & Co., MADRAS-81